# అమనస్కుడు



– మాస్టర్ కంభంపాటి పార్వతీ కుమార్


ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక
విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,
రాజమహేంద్రవరం – 533 101.

MOHAN PUBLICATIONS

Mohanpublication.com
Granthanidhi.blogspot.in

# అమనస్కుడు

## 1

అది ప్రభాత సమయము. చీకటి వెలుగుగా మారుతున్న అద్భుత సన్నివేశము. ఆకాశములో రంగుల విన్యాసమును గమనించు జీవులను ఆకర్షించే కమనీయ దృశ్యము. సముద్ర తరంగముల నుండి పిల్లవాయువులు జీవులను స్పృశించి శుభాకాంక్షలు అందిస్తున్నవి. లోకాలకు చైతన్యము ప్రసాదించటానికి మరొకమారు ఉత్సాహముతో బాలభానుడు ఉదయిస్తున్నాడు. కిరణములయొక్క కాంతి సముద్ర తరంగములపై బంగారపు రంగును ప్రతిబింబిస్తూ వున్నది. సృష్టి వైభవమును ప్రతి ఉదయం జీవులకు గుర్తుచేసే విధముగా భూమి, ఆకాశములు స్ఫూర్తి నిస్తున్నవి.

మేల్కొంచిన జీవులు ఎవరి పనులలో వారు తలమునకలై వున్నారు. మేల్కొంచిన దగ్గరనుండి ఆహారమునకై ప్రయాస, ధనమునకై అన్వేషణ, ఏదో తెలియని ఆరాటము అందరినీ రాట్నం తిప్పుతోంది. తమకొఱకు, తమ కుటుంబము కొఱకు, తమవా రనుకుంటున్నవారి కొఱకు లేచిన దగ్గరనుండి ఒకటే తాపత్రయము. సముద్రతీరములో పిల్లవాయువుల చల్లని స్పర్శనము అనుభవిస్తూ జీవితపు రంగుల రాట్నము నుండి ఈవలకు వచ్చి ప్రభాత సమయపు దివ్యకాంతులను ఆస్వాదిస్తూ, ప్రకృతి రమణీయతను శ్లాఘిస్తూ, ప్రశాంత మనస్కుడై, ఒక పసివాడు

కూర్చుని వున్నాడు. అతడు పది సంవత్సరముల ప్రాయము వాడు. మిసమిసలాడే శరీరఛాయ ఆరోగ్యకరమైన దేహాన్ని సూచిస్తోంది. ముఖవర్చస్సు వెలుగును నింపుకుని వున్నది. వెలుగును మాత్రమే అన్వేషించుచున్న కన్నులు నిశితముగను, నిశ్చలముగను మిరుమిట్లు గొలుపుచున్నవి. అతనియందు సహాధ్యాయులకున్న ఆరాటములేదు. జీవితమున, కేవలము ఆర్జనము, శరీర పోషణము మాత్రమేకాక దివ్యమైన విషయములను తెలుసుకొనుట, అనుభూతి చెందుటయందు ఎక్కువ ఆసక్తి కలిగినట్లుగా గోచరించుచున్నాడు. అతడు సామాన్య భావములను మించి దేనినో తెలియని దానిని అన్వేషించుచున్నట్లుగా కన్పట్టుచున్నది. అతడు ఇతరులకు భిన్నముగ కన్పట్టుచున్నాడు.

తల్లితండ్రులను, సోదరులను, బంధువులను, మిత్రులను లోతుగ పరిశీలించిన వారి జీవనము అతనికి యాంత్రికముగ నున్నది గాని రసానుభూతి కొఱకు అన్వేషించుచున్నట్లుగా అతనికి కన్పట్టుట లేదు. ఇతర జీవులవలె తాను కర్తవ్యము లను యాంత్రికముగ నిర్వర్తించు చున్నప్పటికీ లోపల ఏదో తెలియని దానిని అన్వేషించు తపన ఒకటి యున్నది. అన్వేషణ దేనిని గూర్చియో తెలియదు. కాని నడచుచున్న జీవితము కేవలము యాంత్రికమే అని మాత్రము తెలియును. జీవితమున, సామాన్యులందరూ నున్న స్థితికన్న మిక్కుటమైన ప్రయోజన మేదియో కలదని తోచుచున్నది. అదియే అతని అన్వేషణమును ఒక తపస్సుగా తీర్చిదిద్దుచున్నది. అది కారణముగా ఇతరులకు భిన్నముగ అతడు ప్రభాత సమయమున ఆకాశము, భూమి వ్యక్త

మొనర్చుచున్న దివ్య విన్యాసములను గమనించుచు వుండిపోయినాడు.

"అమనస్కా!" అని అతని తల్లి పిలిచినది. అతడు దూరతీరముల నుండి స్పృహలోనికి వచ్చినాడు. తల్లిని ప్రశాంత మనస్కుడై చూచినాడు. అతడు అమనస్కుడు. తల్లి మనో భావములను గమనించినాడు. చిరునవ్వుతో తల్లిని మన్నన చేసినాడు. తల్లి యిట్లు ప్రశ్నించినది. "అమనస్కా! ఏమి నీ బాధ? తోటి పిల్లలవలె నీ వెందుకు మెలగవు? అందులోని కష్టమేమి? అందరివలె ఎందుకు తినవు? ఆడవు? తిరుగవు?"- అమనస్కుడు ఒక ముహూర్తకాలము నిశ్శబ్దము వహించినాడు. "వారివలె నుండుట కష్టము కాదమ్మ. కాని యింతకు మించిన జీవితము మరొకటి వున్నదని, అది ఏమో తెలుసుకొనవలెనని, అహర్నిశలు లోన ఒక ఆరాటము కలుగుచున్నది. మనసున నే నెగురగలనని' సహజముగా గాలిలో తిరుగాడగలనని ఒక భావన కలుగుచున్నది. అది ఎట్లో నాకు తెలియదు. దాని కొఱకై యోచించుచున్నాను" అని పలికినాడు. ఇంతలో అమనస్కుని తండ్రి అక్కడకు చేరినాడు.

తండ్రి : "ఊహలలో జీవించుట అద్భుతముగ నుండును గాని ఊహలు అన్నము పెట్టవు, ఆకలిని తీర్చవు. శరీరపోషణము కొఱకు ప్రతి జీవియు నిర్వర్తించు కార్యములను నీవును నిర్వర్తింపవలెను. ఊహాగానము కారణమున కర్తవ్యము లను విస్మరించరాదు. మేమును నీవలె ఊహలయందు జీవించినచో మన అందరి ఉదర పోషణము ఎట్లు జరిగెడిది? నీవును మా

వలెనె, శిక్షణ పొందుము. ఊహలను అట కెక్కించుము. చక్కగ చదువుకొనుము. మంచి ఉద్యోగము సంపాదించుము. పెండ్లి చేసుకొనుము. సంతానము పొందుము. వారిని పోషించుము. తదనుభూతిని పొందుము.

అమనస్కుడు తండ్రిని వినయముతో ప్రశ్నించెను. "జీవిత ప్రయోజన మంతియేనా? అంతకు మించి ఏమియును లేదా?".

తండ్రి : "సంఘమున మేమందరము అట్లే జీవించు చున్నాము కదా! మా పెద్దలు మాకు బోధించినదే మే మాచరించుచున్నాము. తన్ను తాను పోషించు కొనుటయే ప్రధాన ధర్మము. అవకాశమును బట్టి ఇతరులను కూడ పోషింపవచ్చును. ఇంతకు మించి భావన చేయుట ఆచరణ శూన్యతను కలిగించును. బుద్ధిమంతుడైన వాడు రాబోవు కాలమునకు కూడ వలసినంత ఆర్జించి, రక్షణము పొందు చున్నాడు. జీవితమున ఆర్జనము అందువలన ముఖ్య ప్రయోజనముగ నిలుచుచున్నది."

అమనస్కుడు మౌనము వహించినాడు. అది అంగీకార ముగ తల్లితండ్రులు భావించినారు.

తల్లితండ్రులు తెలిపిన విషయములను శ్రద్ధగా విమర్శించుకొని భక్తిపూర్వకముగ అట్లాచరించుట ఆరంభించి నాడు. తానును తన సహాధ్యాయులవలె ప్రవర్తించుటకు ప్రయత్నించినాడు. సహాధ్యాయుల ప్రవర్తనము అతనికి పరిమిత ముగ తోచినది. కొట్లాడుకొనుట, పోటీపడుట, అబద్ధము లాడుట, అసూయ పడుట అతనిని నిరాశ పరచినవి. "వీరివలె నే

జీవించలేను, కాని తల్లితండ్రులు ఇట్లే జీవింప వలెనని బోధించుచున్నారు. జీవితము మాత్రము ఇది కాదు'' అని క్రమశః అంతరంగమున సూచన జరుగుచున్నది. అమనస్కుడు ఘర్షణయందు నిలబడినాడు.

''దారేషణ, ధనేషణ, పుత్రేషణ''. ఇంతేనా జీవితం అన్న వినికిడితో ఉలిక్కిపడి లేచాడు అమనస్కుడు. ఎవరు పలికారో తెలుసుకోవాలని పరికించి చూశాడు. ఎవరూ కనపడ లేదు. ఎవరూ కనపడక ''వినికిడి ఎక్కడినుంచి వచ్చింది?'' ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది. సమాధానము రాలేదు. ఉదయాన్నే వినిపించిన ఈ భావము అమనస్కుడిని ఆలోచనలో పడవేసింది. చదువుకుంటాను, ఉద్యోగము సంపాదిస్తాను, పెళ్ళి చేసుకుంటాను, పిల్లల్ని కంటాను, వారికోసం సంపా దిస్తాను, అవకాశాన్ని బట్టి సంఘంలో కీర్తి గడిస్తాను, పలుకు బడితో మరింత సంపాదిస్తాను, సంపాదనతో మరింత ఆధిపత్యం సాధిస్తాను. ఆ తర్వాత ఏం చెయ్యాలి? ఈ లోపల వృద్ధాప్యం వస్తుంది. రోగాలు మీద పడతాయి. వారిమీద వీరిమీద ఆధారపడి కొంతకాలం సాధిస్తాను. ఆ తర్వాత అందరిలాగే నిష్క్రమిస్తాను. ఇది అందరూ జీవిస్తున్న జీవితమే. జీవులకు ఈ గానుగెద్దు జీవితమేనా? ఇంకేమైనా భగవంతుడు నిర్దేశించాడా? ఈ జీవితంలోనే రసానుభూతి పొందమని తల్లి తండ్రులు, కులపెద్దలు చెప్తున్నారు. ఈ చెప్తున్న వారెవరూ రసానుభూతితో వున్నట్లుగా గోచరించటం లేదు. ఎప్పుడూ కొట్లాటలే! కుమ్ములాటలు, కొట్లాటలు. ఒకరినొకరు తిట్టిపోతలు చేసుకుంటూ జీవిస్తూ అదే రసానుభూతి అని మోసము చేసు కుంటున్నారు.

భవిష్యత్తు గురించి భయపడుతూ ఆ భయానికి మందుగా ఒక దేవుడిని సృష్టించుకుని భయమే భక్తిగా భావిస్తూ ఆస్తికులమని భ్రమపడుతున్నారు. రేపటి కుండదేమో అనే భయంతో జీవితానికి సరిపడా పోగేసుకోవటంలో పోటీపడి ఒకరి నొకరు దోచుకుంటున్నారు. అలా దోచుకోని వారిని తెలివితక్కువ వాడిగా భావిస్తున్నారు. జీవితాలు రాగద్వేష పూరితములై తమవారు, ఇతరులనే కరడుగట్టిన భావములతో వర్గములు వర్గములుగా ఏర్పడి ఆజన్మము పరస్పర శత్రుత్వము వహిస్తున్నారు.

తమ అభిప్రాయములను ఇతరులపై రుద్ది, అందరినీ గొఱ్ఱెల మందలుగా తయారుచేసి తమ స్వార్థ ప్రయోజనములకై మరికొందరు తెలివైనవారు వాడుకుంటున్నారు. మరికొందరు దైవము పేరున జనులను ఆకర్షించి తమ వ్యక్తిగత ప్రణాళికలకు వారిని బలిచేసి ఆనందించుచున్నారు. మొత్తముగ వీరందరును వారి వారి భావముల కమ్ముడు పోయినవారే కాని భావమునకు పుట్టుక స్థానమైన తమని తాము ఎరుగక, జీవితముపై స్వామిత్వము లేక బానిసలవలె జీవించుచూ ఇతరులు కూడ అట్టి బానిసత్వమందు జీవించవలెనని ఆకాక్షించుచున్నట్లుగా తోచుచున్నది. ఇందు రస మేమున్నది? అనుభూతి ఏమున్నది? జీవితము దివ్యమైనదని వీరే చెప్పుదురు. దివ్య వైభవమును అనుభూతి చెందుట ఎట్లో తెలియకే జీవించుమని బోధించు చున్నారు!

❋ ❋ ❋

ఇటువంటి భావపరంపరలతో ప్రభాత సమయ మంతయూ గడచినది. అమనస్కుడు దిక్కుతోచక నిరాశా నిస్పృహలతో దైనందిన కార్యక్రమముల కున్ముఖుడైనాడు. పెద్దలు చెప్పిన రీతిలో యాంత్రికముగా విద్యాభ్యాసము చేయుచున్నాడు.

విద్యార్థులలో కొందరు తన రీతి భావనలు కలిగి యున్నను, వారు బాధ్యతాయుతులుగ గోచరింపలేదు. వారు కేవలము సంఘముయొక్క కట్టుబాట్లను, సాంప్రదాయమును ధిక్కరించుట యందు ఆసక్తులై యున్నారు గాని, జీవిత ప్రయోజనము కొఱకు అన్వేషించుట యందు లగ్నమై యున్నట్లు తోచలేదు. వారు విప్లవ భావములు కలిగి నిర్మాణాత్మకము, సృజనాత్మకము అయిన భావములను కోల్పోయి ఉన్మాదులవలె గోచరించుచున్నారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యము, సమత్వము అను పదములకు తమదైన నిర్వచనము చేసుకొని సంఘము నందలి సమస్తమును అవహేళన చేయుట గొప్పగా భావన చేయుచున్నారు. అటు పెద్దలను చూచిన, సాంప్రదాయమందలి ప్రయోజనములను మరచి, నిర్జీవము, యాంత్రికము అయిన జీవనము గడుపుచున్నట్లుగ తోచుచున్నది. ఇటు పిన్నలను చూచిన, బాధ్యతారాహిత్యము, విప్లవ ఉన్మాదము గోచరించు చున్నది. ఒకరు సృజనాత్మక శక్తిని కోల్పోయిరి. మరియొకరు సృజనాత్మక శక్తియును, సాంప్రదాయమును కోల్పోయిరి. మరియొకరు జాతి అనుభవమును గ్రహించి గౌరవింపలేక, విప్లవ ఉన్మాదమున పడిరి. రెండింటి యందును అమనస్కునికి శ్రేయస్సు గోచరించుట లేదు. ఒకరు జీవ స్వాతంత్ర్యమును పరిపూర్ణముగ కోల్పోగా,

మరియొకరు స్వాతంత్ర్యము పేరున సంఘ విచ్ఛిన్న కారకులుగ తయారగుచున్నారు. స్వాతంత్ర్య ముతో కూడిన సాంప్రదాయబద్ధమైన మరియు బాధ్యతాయుత మైన జీవనవిధాన మొకటి వుండి ఉండవలెను. అది తనకు తెలియవలెను. ఉండివున్నది కావున, తెలియగలదు. అన్వేషణ మొకటియే దానికి దారి. "దివ్య సంకల్పముతో, మౌనముతో అన్వేషణ సాగించెదను" అని అమనస్కుడు కృతనిశ్చయుడై జీవితమును సాగించుచుండెను. మౌనముగ విద్యాభ్యాసము గరపుచూ తీరిక సమయమందు సద్గ్రంథ పఠనము చేయుచూ, సెలవు దినములలో ఊరికి, సంఘమునకు దూరముగ సముద్ర తీరమందు ఏకాంతమును అనుభవించుచూ, ఆ ఏకాంతమున తన అన్వేషణమును తీవ్రముగ కొనసాగించుచూ జీవితమను గ్రంథమున మొదటి అధ్యాయమును కాలక్రమ మున అమనస్కుడు పరిపూర్తి గావించెను. అతనికి ఇరువది సంవత్సరములు నిండినవి. తనపై తాను నిలబడుటకు వలసిన విద్యను అభ్యసించుట పూర్తి అయినది. తానిక తల్లి తండ్రులపై ఆధారపడ వలసిన అగత్యము దాటినది. తనదైన జీవితమును తాను నిర్మాణము చేసుకొనవలెనను ఉత్సాహము అమనస్కుని యందు పెరిగినది. ఇతరులకు బరువు కాకుండ తన జీవితమును ఒక నవ్యము, దివ్యము అయిన పంథాలో నడుపుకొన వలయునని, నూతన ఉత్సాహముతో అమనస్కుడు నిలచినాడు.

## 2

అది మాఘ పూర్ణిమ, అమనస్కుని 21వ పుట్టినరోజు. అమనస్కుడు బ్రాహ్మీ ముహూర్తము వేళ నిద్రలేచి, అభ్యంగన స్నానమాచరించి వడివడిగా సముద్రతీరము వైపునకు సాగిపోయాడు. సరిగా 12 సంవత్సరముల క్రితం తన పుట్టినరోజు నాడు తెల్లవారు జామున అమనస్కునికి ఒక కల వచ్చినది. ఆ కలలో ఆకాశ మార్గాన పయనిస్తున్న కొంతమంది మనుష్య లను చూశాడు. ఆ మనుష్యులు తన వరకు దిగివచ్చి, తనుకూడ వారి సంఘంలో చేరాలని, నేలమీద నడిచే మనిషికన్నా ఆకాశంలో ఎగిరే మనిషి ఎక్కువ వైభవాన్ని రుచి చూస్తాడని, పరిమితత్త్వంనుంచి అపరిమితత్త్వంలోనికి అడుగు పెడతాడని, ప్రతి మానవుడికి ఈ విధంగా ఆకాశగమనం చేసే అవకాశం ఉందనీ తెలిపారు. అప్పటినుంచి అమనస్కుడి మనస్సు ఈ అద్భుత సన్నివేశం గురించి తీవ్రంగా ఆలోచిస్తూనే ఉన్నది. అందుకనే అతనికి జీవితమంటే అందరూ సాగిస్తున్న ప్రయాణంగా కాక, మరేదో కూడా ఉన్నదన్న భావన పటిష్ఠంగా నాటుకుపోయింది. అదేమిటో తనకు తెలియదు. కేవలం తిండి, బట్ట, సంపాదన, కుటుంబం, పలుకుబడి, సంఘం గుర్తింపు- వీటిలో ఎక్కువ రుచి లేదని, ఇంతకు మించిన సత్యమేదో జీవితంలో నిండి వుందని, అది పొందినపుడే మనిషికి తుష్టి, పుష్టి, శాంతి, ఆనందం కలుగుతాయని, దానికేదో నిర్దిష్టమైన మార్గం ఉండి వుంటుందని, ఇన్నాళ్ళూ భావన చేస్తూ వచ్చాడు.

అతని విద్యాభ్యాసం యాంత్రికంగా సాగిపోతూనే ఉన్నది.

సంఘపరమైన జీవితానికి కావలసిన అర్హతలు కూడా ఏర్పడినవి. ఇక తాను సంఘ జీవనంలోనికి చొరబడటం జరుగుతుంది. జీవితం మరికొంత పృథ్వీతత్త్వంవైపు మళ్ళుతుంది. తను చిన్నతనం నుంచి కన్న కలమాత్రం కలగానే మిగిలి పోయింది. అది కల కాదని, అది కూడా నిజమేనని, ఆ నిజానికి, తనకీ మధ్య ఏదో ఒక తెర అడ్డుగా నిలచిందని తనకు తెలుస్తూనే ఉంది. ఆరాటమే తప్ప యింతవరకు మార్గం తెలియలేదు. తన ఆరాటాన్ని అర్థం చేసుకునేవారు కూడా ఎవరూ కనబడటం లేదు. బంధువుల కిది పట్టదు. స్నేహితులకు చెబితే అపహాస్యం చేస్తున్నారు. పెద్ద లనుకొనేవారు తనకేదో ఒక రకమైన పిచ్చి పట్టినదనే భావన కూడ కలిగి ఉన్నారు. తన పరిస్థితి తనకే అయోమయంగా వుంది. అందరివలెనే తాను కూడ జీవించాలని ప్రయత్నించినా అంతరంగంలో తీరని వేదన, అసంతృప్తి గోచరిస్తున్నాయి. తన ఊహా లోకంలోకి ప్రవేశించడానికి మార్గం దొరకడం లేదు. తాను కలగన్న దానికి, ప్రస్తుత పరిస్థితికి మధ్య ఒక తెలిసీ తెలియని స్థితిలో బందీకృతుడై వున్నాడు. ఇది జీవితమూ కాదు, మరణమూ కాదు. మరణమా- అంటే, తాను జీవించే ఉన్నాడు. జీవితమా- అంటే, సమస్తము నందు అశక్తత, విరక్తి నిండి అది మరణము వలె గోచరించుచున్నది. తనకు కలలో కనబడినటువంటి దివ్యజీవులు మరల కనపడి ఏదైనా మార్గాన్ని సూచిస్తే బాగుండుననే ఆరాటం ఈ 12 సంవత్సరాల నుండి తనతోపాటు పెరుగుతూనే ఉన్నది. అది కేవల మొక ఆశగానే మిగిలిపోయింది. ఆశ స్థానంలో నిరాశ పూర్తిగా చోటు చేసుకుంది. నిరాశ నిస్పృహకు దారితీసింది. నిస్పృహ నిస్సహాయ స్థితి కలిగిస్తోంది. నిస్సహాయత నిర్వీర్యుణ్ణి

కావిస్తోంది. ఇక తనకు ఓపిక లేదు. ఈ సముద్రతీరము వెంబడి శరీరంలో ప్రాణం ఉన్నంతవరకు నడచిపోతాను, ఎక్కడ ప్రాణం పట్టు వదలుతుందో, అక్కడ పడిపోవటమే సుఖం. ఇదొక్కటే తనకు పరిష్కారం. తన తపనకు ఇదొక్కటే పరిష్కారం! అనుకుంటూ అమనస్కుడు సాగిపోతున్నాడు. దూర దూర తీరాలవరకూ అలా సాగిపోయాడు. సూర్యు డుదయించడం, నడినెత్తికి చేరడం, అస్తమించటం కూడా జరిగింది. అది తన పుట్టినరోజు, రోజంతా పచ్చినీరైనా ముట్టలేదు. సూర్యాస్తమయ సమయ ములో పూర్ణచంద్రుడు తూర్పున ఉదయిస్తూ గోచరించాడు. సముద్రం పైనుండి చల్లని వాయువులు అతని శరీరాన్ని స్పృశించాయి. అతడు ఇసుక తిన్నెలపైకి ఒరిగిపోయాడు.

ఒక ప్రక్క శరీరం ఒరుగుతూ ఉంటే, చల్లని స్పర్శను పొందిన మనస్సు ఆకాశంలోకి ఉరకలు వేసింది. చంద్రబింబం నుండి వచ్చే వెన్నెలకాంతిలో నుండి సూటిగా రెండు కిరణాలు తనవైపుకు దూసుకొనివచ్చాయి. ఒక కిరణం మనస్సుని, మరొక కిరణం శరీరాన్ని తాకుతున్నాయి. అమనస్కుడు పూర్ణ చేతస్కుడై నిలబడ్డాడు. రెండు వెన్నెల కిరణాలు రెండు మానవాకారాలుగా రూపు చెందాయి. మందస్మితంతో అమనస్కుని పలకరించారు. పూర్ణచేతస్కుడైన అమనస్కుడు వారి దర్శనంతో ఒక క్షణం దిగ్భ్రాంతి చెందాడు. కన్నులు అశ్రుధారా పూరితములైనవి, గద్గద స్వరంతో వారిని 'మీ రెవరని' ప్రశ్నించబోయాడు, కాని కంఠం నుండి వీపువరకు ఆప్యాయంగా నిమిరి "అమనస్కా!" మేము నీ మిత్రులము, నీకు సోదరులము, నిన్ను నీ గృహానికి తీసుకు పోవటానికి వచ్చాము. నీ తపన ఈ 12 సంవత్సరాలలో ఒక

తపస్సుగా మారింది. నీ తొమ్మిదవ పుట్టిన రోజునాడు ఆ కలలో గోచరించినది మేమే, నీలో ఈ 12 సంవత్సరములలో కలిగిన తపన కారణంగా నీవు మమ్ములను దర్శించుట సాధ్యపడింది. నీవు కూడా మాలాగే ఆకాశ గమనం చేయగలవు, అందుకు మార్గం చూపించటానికే మేము వచ్చాము. మనమంతా సోదరులం. మన సోదరబృందం మరొక తీరంలో ఉన్నది. నీవుకూడా సోదర బృందములో చేరవచ్చు. నిజానికి మన సోదరబృందం ఉన్న తీరమే నీ నిజ నివాసం'' అని పలికారు. అమనస్కుడు పరితృప్తి చెందాడు. తాను యింతకాలం దేని నాశించి తపన చెందాడో ఆ మార్గం తెలపటానికి దైవమే అనుగ్రహించి ఇద్దరు సిద్ధులను పంపినట్లు భావించాడు. జీవితం ఆశించిన మలుపు తిరుగబోతోంది. జరిగిన జీవితం, జరుగబోవు జీవితం మధ్య ద్విమనస్కుడై అమనస్కుడు నిలిచాడు.''

''నిజానికి నాకే నివాసమూ లేదనుకుంటున్నాను. ఇంతవరకూ నా కెవరూ లేరుకూడా! ఎవరి ఆదరణ కూడా లభించలేదు. ఒంటరినై తిరుగాడుతూ అలసి ఉన్నాను. నేనిప్పుడు మీరు తెలిపిన తీరం వరకు రాగల్గిన స్థితిలో లేను, ప్రాణములు కడతప్పి, శరీరం పతనావస్థలో ఉన్నది. మీ దర్శనం నాకెంతో ఆనందాన్ని కల్గించినప్పటికీ ఈ నా శరీర పరిస్థితి నన్ను గమ్యానికి చేర్చలేదు. ఈ జన్మకు ఇంతటితో సరి. మీ దర్శన భాగ్యంచేత కలిగిన ఈ స్ఫూర్తి మరు జన్మకి నన్ను మార్గంలో నిలబెడితే అంతే చాలు. ఇప్పటికిక నన్ను మన్నించి శెలవిప్పించండి'' అన్నాడు. దివ్యపురుషు లిద్దరూ ఒకరి నొకరు చూసుకొని, లాలనగా

అమనస్కునితో ఇట్లు పలికారు. "అమనస్కా! నీవు నీ పూర్వ భావములలో నిలచి ఉండుటచేత నీకట్లనిపించుచున్నది. నీవిపుడు అపూర్వుడవు, నిర్వీర్యుడవుకాదు. నిస్సహాయుడ వసలే కాదు. నీవొకసారి నీ శరీరమును పరికించుకొని చూడుము. ఇంతవరకు నీవు జీవించునది ఒకరకమైన పాఠశాల. ఇకముందు నీవు జీవించునది దివ్యము, నవ్యమునైన విద్యాలయము. ఇందు నీ పరిమి తత్త్వములన్నియు, క్రమశః అదృశ్యమై, నీ నిజస్థితిని పొంద గలవు. ఒకసారి నీ శరీరమును మరల పరికించి చూచు కొనుము."

అమనస్కుడు శిథిలమైన తన శరీరంవైపు ఒకసారి పరికించి చూశాడు. విష్ణు స్పర్శవలన ద్విగుణీకృతమైన గజేంద్రుని శరీరమువలె తన శరీరము పటిష్ఠంగానూ, తేజోవంతముగాను గోచరించింది. అమనస్కుడు సంభ్రమము, ఆనందము, ఉత్సాహము, స్ఫూర్తి అన్నింటినీ ఒక్కసారిగా పొందాడు. ఎదురుగా ఉన్న దివ్యమూర్తుల పాదములపై పడ్డాడు. వారు ఆశీర్వదించి "బయలుదేరుదామా?" అని ప్రశ్నించారు.

"నేను సర్వంసహా సిద్ధము. మీ ఆజ్ఞను శిరసావహించ గలను. ఇటుపై జీవితము మీరు నడిపింపగలరు. నడుచుటకు నేను సంసిద్ధుడ నైనప్పటికీ మీ ఆశీర్వచన బలమును కోరుచున్నాను. సంకల్ప మాత్రముచేత ఆయుష్షును, ఆరోగ్య మును యిచ్చినారు. ఈశ్వరత్వము వైపు నడిపింపమని నా ప్రార్థన. ఇక సర్వము మీరై మార్గమున నియమింపుడు" అని ప్రార్థించాడు.

దివ్య శరీర ధారణతో అమనస్కుడు తన సుపరిచిత

ప్రదేశాన్ని వదలి ఉత్తర దిశగా పయనం సాగించాడు. తను పుట్టి పెరిగిన ప్రదేశాన్ని చివరిసారిగా ఒక్కసారి చూచాడు. ఈ ప్రదేశంలోనే కదా తా నిన్నాళ్ళు గమ్యంకోసం వేచివున్నది, అని భావన చేశాడు. తనవారనుకున్న వారెవరు తన ఆశయాలను అవగాహన చేసుకోలేదు. అగౌరవ పరిచారు కూడ. వారికి జీవితమున తినుట, నిద్రించుట, తిండికొరకై ఆరాటపడుట తప్ప మిగిలిన విషయములయందు ఎందుకు శ్రద్ధ, ఆసక్తి లేదో తన కీనాటికీ అంతు పట్టలేదు. తానిపుడు అందరిని వదలి తానెన్నుకున్న మార్గములో ముందుకు సాగిపోతున్నాడు.

దివ్యమూర్తు లిద్దరు అమనస్కుని చెరొక భుజము పట్టుకొని లేపి క్రమశః ఆకాశములోకి లేచారు. అమనస్కుని కాశ్చర్యము వేసినది, తనను యిలా ఎంతదూరము మోసుకు పోగలరు అన్న భావన తనయందు కలిగిన మరుక్షణములోనే, వారు చిరునవ్వుతో మేము మోయటము లేదు, నీవు ఎగురుతున్నావు. నీ వెగురగలవని నీకు తెలియదు, మాకు తెలుసు. ప్రస్తుతము మా సమక్షములో నీకు పూర్ణ విశ్వాస ముండుటచేత మేము కారణంగా ఎగురుతున్నావని నీవు భావన చేస్తున్నావు. నిజానికి నీవే ఎగురుతున్నావు. అమనస్కుడు ఆశ్చర్య చకితుడయ్యాడు. నిజానికి భుజములపై ఆ దివ్యమూర్తుల స్పర్శజ్ఞానము వున్నది తప్ప వారు తనని మోయుట లేదని గమనించాడు. వారితో పాటుగ మేఘాలను దాటి పైన విహరిస్తున్నప్పుడు స్వచ్ఛమైన సూర్యరశ్మికి వారి దేహాలు మరింత హిరణ్మయ కాంతులు వెదజల్లుచు గోచరించినవి. తన శరీరమును పరికించి చూసుకుంటే తన శరీరముకూడ కాంతి పొందుతూ వారి శరీరము వలనే

గోచరించినది. అతడు మరల విస్తుపోయాడు. తన శరీరము మార్పు చెందింది. మునుపటివలె లేదు అని భావన చేశాడు. ఈ శరీరంతో తాను ఆకాశములో విహరించగల నన్న దృఢ విశ్వాస మేర్పడినది. ఉత్సాహముతో వారితో సమానమైన వేగముతో ముందుకు సాగాడు.

"మన ఆశ్రమ ప్రాంతానికి చేరుకొంటున్నాము. ఇది హిమాలయములకు ఉత్తర ప్రాంతము. మన మిపుడు ఈ కొండ చరియలలోనికి నెమ్మదిగా దిగుదాము." అని దివ్యమూర్తులు తెలిపారు. ఆకాశము నుండి భూమికి దిగివచ్చు సందర్భములో ఉత్తర ప్రాంత పరిసరములను అమనస్కుడు గమనించాడు. ఆ ప్రాంతములో తనలాగ విహరిస్తున్న మరికొందరు గోచరించారు. "వీరంతా మన బృందములోని సభ్యులే" అన్నారు దివ్యమూర్తులు. వీరు నీకు సోదరులు, ఈ ప్రదేశము నీ స్వదేశము అని తెలిపారు. అమనస్కుడు పరికించి చూచాడు. దృశ్యము క్రొత్తగా నున్నది. భావములు దివ్యమై యున్నవి. క్రొత్త ప్రశ్నలు పుట్టుకొస్తున్నవి. తన దేశమునందు గుట్టలు గుట్టలుగా జీవులు గోచరించేవారు. ఇక్కడ అందులో సహస్రము వంతు కూడా కనిపించటము లేదు. ఆశయసిద్ధి కోసము పాటుపడేవారు ఇంత తక్కువగా వుంటారా? అని అమనస్కుని కాశ్చర్యము వేసినది. భూమిని తాకే సమయానికి తనకు శ్రమ తోచినది. తనతో పయనించిన వారు శ్రమపడినట్లు గోచరించలేదు. ఈ భావన కలిగిన మరు క్షణంలోనే దివ్యమూర్తులు చిరునవ్వుతో "శ్రమ అనునది నీ భావమే, ఇదివరకటి స్థూలశరీరంలో నీకు శ్రమ అన్న భావన అభ్యాసమయ్యింది. అభ్యాస వశముచేత

శ్రమ అనుకుంటు న్నావు కాని నిజానికి శ్రమలేదు, నిద్రకూడ లేదు'' అని తెలిపారు.

ఆశ్రమప్రాంతం చేరగానే ఒక పన్నెండుగురు సోదరులు తనను చుట్టుముట్టారు. చిరునవ్వుతో స్వాగతం పలికారు. ఈ ఆశ్రమము తన స్వగృహంగా భావించమన్నారు. తను నివసించు గదికి దారిచూపారు. కొంతసేపు విశ్రమింపమని తెలిపారు. తను చదువుకునే రోజుల్లో సీనియర్లు జూనియర్లను ఏడిపించుకు తినేవాళ్ళు. ఇక్కడ విద్యార్థులు, క్రొత్తగ వచ్చిన వారిని ఆదరిస్తున్నారు. అది అక్కడి ఆచారం. ఇది యిక్కడి ఆచారం. నిజానికి ఇది అనాచారం. అనాగరికత. ఇదియే నాగరికత. అమనస్కుడు విశ్రమించాడు.

జీవితములో తనకిది సుదీర్ఘమైన రోజు. తాను నిదుర లేవటము, పౌర్ణమి ఘడియలను అను భూతి చెందుతూ సముద్ర తీరములో ఒంటరిగా పయనించటం, ఆకలి దప్పులను మరచి ముందుకు సాగటము, ఆశయ సిద్ధికి తపించటము, నిస్పృహ చెంది నేల కొరగటము, దివ్యమూర్తులు దర్శన మియ్యటము, వారితో సంభాషించటము, ఆకాశ గమనము చెయ్యటము, హిరణ్మయ శరీరమును పొందటము, ఆత్మ బంధువులను కలియటము, ఈ ఉత్తర ప్రాంతములో విశ్రమించటము- ఇన్ని సంఘటనలు గబగబా ఒకేరోజు జరిగి, అతన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

# 3

క్రొత్త ప్రదేశంలో క్రొత్త వాతావరణంలో అమనస్కుడు ప్రభాత సమయములో నిదుర లేచాడు. అచ్చటి బృందముల వారంతా ఉదయాన్నే తీవ్రమైన ధ్యానంలో నిమగ్నమై యున్నారు. వారందరికి మరికొంత ఉన్నత స్థితులను కల్పించే మార్గాన్ని బోధిస్తున్న ఒక బోధకుడు కన్పించాడు. అతడు వారికి శ్వాస, స్పందనము, సూక్ష్మ స్పందనముగూర్చి బోధన చేసి సాధన చేయిస్తున్నాడు. మనస్సును శ్వాసమీద లగ్నం చేయమని, శ్వాస ద్వారమున స్పందనాత్మక ప్రజ్ఞను చేరమని, స్పందనాత్మక ప్రజ్ఞనుండి సూక్ష్మ స్పందనములోకి ప్రవేశించమని, తత్ఫలితముగ హంస స్వరూపుడై అనంతమైన తత్త్వములోనికి ప్రవేశించమని బోధ చేస్తున్నాడు. వారందరు శ్రద్ధాళువులై ధ్యానమందు బోధకుడు యిచ్చిన సూచన ప్రకారము నిమగ్నులై యున్నారు. అమనస్కుడు సమస్తాన్ని గమనిస్తూ నిలబడి యున్నాడు.

ఇచ్చటివారి పరిస్థితి కూడ సాధక స్థితియే, పూర్ణత్వము కాదు. పూర్ణత్వము కోసము వీరు ప్రయత్నము చేస్తున్నారు. కాకపోతే మునుపటి జీవితములోని బంధములు యిందు లేవు. ప్రశాంతమైన వాతావరణం ఊర్ధ్వముఖంగా చేతన ప్రయాణించుటకు అనువుగా వున్నది. సత్సాధకుల సాంగత్య మున్నది. పూరణత్వము చెందటానికి అనువైన పరిస్థితులు సమృద్ధిగా వున్నాయి. ఇంత ప్రశాంతమైన జీవితాన్ని అనుభూతి చెందుతున్నవారు మాత్రము బహుకొద్దిమంది మాత్రమే వున్నారు. కీచులాడుకొంటూ, పోటీ పడుతూ, తగవులాడుతూ తిండికోసమే జీవిస్తున్న కోట్లాది జీవులు

ఈ జీవన విధానములోని రుచి పొందితే ఎంత బాగుండును? అని భావనచేస్తూ అమనస్కుడు మనో లోకంలో విహరిస్తూ వుంటే అచ్చటి బోధకుడు అతని వద్దకు వచ్చి ఇలా ప్రసంగించాడు: "భూమి జీవులలో లక్ష కొకనికి ఈ విధమైన ప్రశాంత జీవనమునందు ఆసక్తి కలుగు తుంది. అటువంటి వారిలో మరల లక్ష కొకనికి నీకున్న తపన ఏర్పడుతుంది. ఇచ్చటి వారందరు, దీర్ఘ కాలము అనగా జన్మల తరబడి అట్టి ఆసక్తి, తపన కారణముగ యిక్కడికి చేరుకోవటము జరిగింది. నీకు జీవితమంటే నిద్ర, ధనము, పదవి, గుర్తింపు మొదలైనవి మాత్రమే కాదని, అంతకు మించినదేదో జీవితమున ఉద్దేశింపబడినదని తీవ్రమైన భావన కలిగినది కదా! ఈ భావన కలుగుటకు ముందు నీకెన్ని జన్మలు కలిగినవో నీకు తెలియునా? వేల జన్మల సామాన్య జీవితమునుండి నీవు పొందిన సారాంశముగ నీ కట్టి భావనలు కలిగినవి. ఇట్టి ఆలోచనలు కలిగిన తరువాత పూర్ణత్వము గూర్చి చేయు సాధనమున వందల జన్మలు గడచును. ఇచ్చట మనము నేర్చుకొను ఉన్నతమైన విషయములను బట్టి ఉన్నత లోకములలో జీవించుటకు వీలు పడుచుండును. ఏమియు నేర్చుకొనక, ఉన్నత భావములను పెంపొందించుకొనక, ఉత్తమ సంస్కారములను కోరక జీవించినచో, సామాన్యమైన జీవనము మరల మరల కలుగుచుండును. అదే రకములైన పరిమితత్త్వములు, సమస్యలు, బరువులు, బాధ్యతలు పీడించుచుండును. అట్టి విషయములనుండి బయల్పడుటకు తీవ్రముగ వున్న భావముల నాశ్రయించుట ఒక్కటే మార్గము. నీ భావము నందట్టి తీవ్రత వుండుటచే నీవు ఈ పవిత్ర ప్రదేశమును చేరుకొన గలిగితివి. నీవా రనుకొనువారు యిట్టి భావనను

తపస్సుగ ఆచరించక పోవుట వలన వారక్కడే అత్యంత పరిమితమైన జీవితమునందు కొట్టుమిట్టాడుచున్నారు. జన నము, మరణము అను విషయమునందు తీరికగా తిరుగు చున్నారు. వారికి నీ స్ఫూర్తి కలుగనంత వరకు అదే వలయమున, అదే లోకమున జన్మ లెత్తుచుందురు.”

తన మనస్సులోని భావములను తాను వ్యక్తపరచకయే ఈ బోధకుడు గ్రహించినాడు. తనను యిచ్చటికి తీసుకువచ్చిన దివ్యమూర్తులు కూడా తన మనో భావములను అతి శీఘ్రముగా గ్రహించి సమాధానము లిచ్చినారు. భావమునకు భాషయను తొడుగు నెక్కించి గొంతునుండి వ్యక్తము చెయ్యకయే వీరికి తెలియుచున్నది. ఈ లోకమున భాషా ప్రమేయము లేనట్లున్నది. కావున భాషా విభేదములు లేవు. వేర్వేరు భాషలను మాట్లాడు వారు, వేరు వేరు వర్గములుగ ఏర్పడుట, భాషాభిమానముచే ఇతర భాషల వారిని వేర్పాటు ధోరణిలో చూచుట వంటి పరిమితత్త్వమునకు ఇచ్చట తావు లేదు.

భావమును శ్రవణము చేయగలిగిన ప్రజ్ఞ కలిగియున్న పుడు భాషకు ప్రాధాన్యము లేదు. వైఖరీ వాక్కు యొక్క ప్రమేయమేలేదు. ‘ఇది భావమయ ప్రపంచము కాబోలు’ అని అమనస్కుడు తలచుచుండగా బోధకు డిట్లనెను: “భావమయ ప్రపంచము కూడ పరిమితత్త్వముతో కూడినదే. కావున ప్రజ్ఞా మయ ప్రపంచము లోనికి పయనించుట నీ ప్రస్తుత కర్తవ్యము. నిన్నట్టి ప్రజ్ఞయందు నిలుపుటకు మార్గము చూపుట నా ప్రస్తుత కర్తవ్యము. కావున మరికొంత అంతర్ముఖుడ వగుటకు సిద్ధపడుము. మార్గమును తెలిపెదను, శ్రద్ధగా వినుము.

శరీరమును సుఖముగు ఆసనమున నుంచుము. సర్వాంగముల నుండి చేతనను సమీకరణము చేసి మనస్సు నందు నిలుపుము. మనస్సును హృదయమున నిరోధింపుము. గుండె కొట్టుకొనుటను గమనించినచో మనస్సు హృదయమున నిలుప బడును. గుండె కొట్టుకొనుట నుండి క్రమశః మనస్సు హృదయ స్పందనకు చేరును. స్పందనమున నిలచిన మనస్సు హృదయము నుండి మెల్లగా ఊర్ధ్వముగా పయనించును. క్రమశః స్పందనము భ్రూమధ్యమునకు చేరు సమయమున శ్వాస, గుండె కొట్టుకొనుట, స్పందనములు ప్రజ్ఞయందు శమించును. అప్పుడు ప్రజ్ఞ ఒక వెలుగుగను, నాదముగను గోచరించును. అట్టి ప్రజ్ఞయందు స్థిరపడుటకు ప్రయత్నించుము. నీకిది మలిమెట్టు. ప్రశాంతముగ ఈ సాధనను కొనసాగించుము. నీ కిచ్చట సాధనకు అంతరాయ ములు లేవు. నీయందు గల సంకల్పబలము యొక్క తీవ్రతయే తపస్సు. తపస్సును బట్టి సిద్ధి కలుగును. యోగమున నీ విపుడు మరి మూడు మెట్లెక్కి "ధారణ"ను పొందగలవు. నీకు శుభమగు గాక! ఇచ్చట బృందములోని వారందరూ కూడా ఇదే కార్యక్రమమున నిమగ్నులై యున్నారు. నీవు కూడ వారివలెనే ప్రయత్నము కొనసాగింపుము."

అమనస్కుడు బోధకునికి నమస్కరించి ఆశీర్వచన మును పొంది తపస్సున కుపక్రమించెను. తాను భావమయ ప్రపంచమున నుండుటచే మనస్సు భ్రూమధ్యమున లగ్నముకాక సంకల్పములు కలుగుచుండెను. మనస్సునకు తెలుసుకొన వలెనన్న కుతూహలము సహజము. కనుకనే ఒక అంశము తరువాత మరియొక అంశము

స్ఫురించుచు అనంతముగ ఆలోచనయందు మునిగి యుండును. చాంచల్యము మనస్సుయొక్క సహజ గుణమని తలచెను. కనులు తెరచెను. బోధకునకు అమనస్కుని మనోభావము అవగత మగుటచే చిరునవ్వుతో ఇట్లనెను.

‘‘సంకల్పములు కలుగుచున్నవని అధైర్యపడరాదు. ఎన్ని మారులు సంకల్పములు కలుగుచున్నను, కలుగుచున్న సంకల్పమును పరిశీలించు చుండుము. పరిశీలన యందు ఓర్పు, నిదానము కలిగి యుండవలెను. త్వరపడరాదు. త్వరపడుట యనగా మరల మనస్సుగా దిగి వచ్చుటయే. సాధన యందు సిద్ధి ఆలస్య మగుచున్నదని భావింపరాదు. ఆలస్యమనగా సిద్ధిపొందు కాలమును తాను ముందుగ నిర్ణయించు కొనుటయే కదా! అది మనోనిర్ణయమే గాని కాల నిర్ణయము కాదు గదా! కావున ఓర్పుతో నిదానముగ చెప్పబడిన సాధన చేయుటయే గాని మరియొక ఆలోచనకు తావివ్వకుము. ఆలస్యమను భావము రజోగుణము వలన కలుగును. భావములు కలిగినప్పుడెల్ల భావమును పరిశీలింపుము. నీవు పరిశీలన చెయ్యగనే భావము అదృశ్యమగును. భావనా పరిశీలకుడుగా నీవున్నంత వరకు భావ ముద్భవించదు. నీకు మరుపు కలిగిన క్షణమున పూర్వ వాసన కారణముగ మరల భావము లుద్భవించి పరువెత్తును.

దొంగ పారిపోవుచుండగా పట్టుకొని రావలెనన్నచో వాని వెంట పరుగెత్తవలెను. సాధనలో మనస్సు వివిధ భావములుగ తప్పించుకొని పోవుచున్నపుడు పరిశీలించుట అను భావమును

క్రీడగ సలుపవలెను. పరిశీలించిన క్షణమున భావ మదృశ్యమై భావమునకు పుట్టుక స్థానమగు ప్రజ్ఞ మాత్రము మిగులును. మనస్సు చంచలము గనుక పరుగెత్తును. ప్రజ్ఞ స్థిరము గనుక పరువెత్తక పరుగెత్తుచున్న మనస్సును స్పృశించి తనలోనికి మరల్చు కొనును. ఈ ప్రయత్నమున మొదట మనస్సు రజోగుణ ప్రవృత్తి నుండి బయల్పడి ప్రశాంత మగును. ప్రశాంతమైన మనస్సు ప్రజ్ఞయందు స్థిరపడుటకు ఆసక్తి చూపును. అనుకూలించి ప్రజ్ఞ యందు కరగును.''

అమనస్కుడు స్ఫూర్తితో పునః ప్రారంభము చేసెను.

అమనస్కుడు మరల తపస్సున కుపక్రమించెను. తన యందు వివిధములైన భావము లుద్భవించు చుండగా వానిని గమనించుట, పరిశీలించుట అను ప్రయత్నము క్రమముగ చేయగలిగెను. తనయందు కలుగుచున్న అసంఖ్యాకమైన భావములను గమనించి ఆశ్చర్యపడెను. భావము తన గమనికను తప్పించుకొని సంచారము చేయుట, తాను గమనించగనే భావము లేక తానుండుట జరుగుచుండెను. (తా నుండుట యనగా తా నున్నా నన్న భావముగ నుండుట, మరియొక భావము లేకుండుట.) తా నుండుట, తాను వివిధమైన భావములుగ నుండుట కూడ క్రమముగ గమనింప గలిగెను. తానుగ నున్నప్పుడు భావములు లేవు. భావములుగ నున్నపుడు తాను తానుగ లేడు. తాను భావ మగుచున్నాడు. భావ మగుట, ప్రవృత్తిలోనికి ప్రవేశించుటగా అవగాహన అయినది. భావము లేక తానుగా నుండుట నివృత్తిగా అవగాహన అయినది.

తపస్సున మొదటి దశలలో భావములు విప్పారుట ఎక్కువగ నుండెడిది. తానుగ నుండుట తక్కువగ నుండెడిది. తనకున్న సంస్కారములను బట్టి తనయందు వివిధములైన భావన లేర్పడుచున్నవని గమనించెను. సమకాలికమైన మను ష్యులు, సమస్యలు తన మనస్సునుండి ఉద్భవించుట గమ నించెను. అవికాక మనుష్యులకు సమస్యలకు సంబంధించిన అభిప్రాయములు కూడ జనించుచున్నవని గమనించెను. కొన్నిటి వలన రాగము పలుకుచున్నది. కొన్నిటి వలన ద్వేషము, ఈర్ష్య, అసూయ కలుగుచున్నది. కొన్నిటి వలన బాధ కలుగుచున్నది. మరికొన్నిటి వలన భయము కలుగు చున్నది. ఇన్ని రకముల మనుష్యులు, సన్నివేశములు వుండగ, వానికన్న మిక్కుటముగ వానిని గూర్చిన అభిప్రాయములు కలుగుచుండుట గమనించి అమనస్కుడు విభ్రాంతి చెందెను.

మనో ప్రవృత్తియందు అనంతమైన భావములు యిట్లు ఉద్భవించుచుండగ, తాను ఆదిశేషువలె తన భావమయసృష్టికి ఆధారముగ నిలిచెనని కూడ తెలిసెను. తాను ఆధారముగ, తన భావమయ సృష్టి తన చుట్టును ఏర్పడుచుండునని తెలుసుకొనెను. తాను బీజముగను, తన నుండి వ్యక్తమగు ఈ సమస్తమైన భావము లన్నియు బీజమునుండి వ్యక్తమగుచూ, విస్తరించుచున్న మహావృక్షమని తెలుసుకొనెను. తనయందు భావ ముద్భవించు నపుడెల్ల తానే ఆ భావ మగుచున్నాడని తెలిసెను. తల్లిదండ్రులు తలపునకు వచ్చినప్పుడు తాను పుత్రు డగుచున్నాడు. సోదరులు గుర్తుకు వచ్చినపుడు తాను సోదరు డగుచున్నాడు. బంధువులు

గుర్తుకొచ్చినపుడు తాను బంధు వగుచున్నాడు. తడవకొక 'నేను' చొప్పున తానే కొన్ని వేల 'నేను'లుగ మారుచున్నాడు. సన్నివేశముల కారణమున ఈ భావమయ కథ తెగక సాగుచుండునని గమనించినాడు. ఈ సమస్తమైన భావమయసృష్టికి తాను కేంద్రముగ తెలుసుకొని నాడు. తా నుండుట కూడ తన అభిప్రాయమే అని గమనించి నాడు. ఈ అభిప్రాయము మనస్సున కలుగుచున్నది అని తెలిసినది. కాని యిది ప్రవృత్తి చెందు మనసునకన్న లోతైన మనస్సు, ప్రవృత్తి చెందు మనస్సునకు ఆధారమైన "నేను" అను భావమని తెలిసినది. "నేను", "తాను" వుండుట యనగా అది మూల భావమని తెలిసినది. ఈ మూల భావమే అహంకార మని పెద్దలు నిర్వచించు చున్నారని కూడ తెలిసి నది. నే నున్నా నను భావమును ఆధారముగ యితర భావ ములను ఏర్పరచుకొని అందు ఆశలు, చుట్టరికములు, ఆస్తి పాస్తులు, అభిప్రాయములు, అభిప్రాయ భేదములు ఏర్పడి సంసార మగుచున్నదని తెలుసుకొనినాడు.

# 4

కొండ చరియలలోని ఒక ఉద్యానవనంలోకి యథా లాపంగా ప్రవేశించాడు అమనస్కుడు. తాను నిర్వర్తిస్తున్న అంతర్ముఖ శోధనను గురించి ఆలోచించ సాగాడు. తాను, నేనను భావము నందు నిలచి యున్నప్పుడు ఇతరములు లేకుండుట అతనికి ఆసక్తి కలిగించినది. కాని ఆ భావమున ఉండక ఇతర భావములు కూడ ఏర్పడుచుండుట తన ప్రమేయము లేకయే జరుగుచున్నది. ఇది యేమి విచిత్రము! తన భావమునందు తనకు స్వామిత్వము లేదా? భావములు తననుండి పుట్టుచున్నను అవి తనపై స్వామిత్వము చూపుట యేమి? ఒక్కొక్కమారు ఒక్కొక్క విషయము నందు తగులు కొనుట, అందుండి తెమలిన సమయమున మరి యొక విషయము తగులుకొనుటగా బ్రతికి యున్నంత కాలము మానవునకు జరుగుచునే యుండునా? నేనను మూలభావము నందుండుటకు ఈ అవరోధము లెట్లేర్పడుచున్నవి?

“అంతయూ అభ్యాసవశమున ఏర్పడుచున్నవి.” అని చిరునవ్వుతో బోధకుడు సమాధానము నిచ్చుచూ ప్రత్యక్షమైనాడు. ముందు శబ్దము వినబడుట, తరువాత బోధకుడు అగుపడుట అమనస్కునికి ఆశ్చర్యము, ఆనందము కలిగించినది. బోధకుడు వివరంగా చెప్పసాగాడు. “అభ్యాసవశమున మనస్సు వివిధము లైన విషయముల యందు తగుల్కొని యుండును. ఏ విషయ ముల యందు ఆసక్తి మెండుగ నుండునో ఆ విషయములపైకి మరల మరల మనస్సు ప్రసరించు చుండును. నీవు ఇప్పుడు క్రొత్త రుచి గొనియున్న భావన “నేను” అను భావన. కాని ఇంకను

పాత రుచులు వీడలేదు. క్రొత్తరుచి యథాశక్తి యున్నను పాత రుచుల యందు బంధింపబడిన మనస్సు అభ్యాసవశముచే అప్రయత్నముగ పాత రుచులవైపు, తత్సంబంధితమైన భావనల యందు చిక్కుకొను చుండును. క్రొత్త రుచికి బలము కలుగువరకు, అది స్థిరపడదు. మనస్సు స్థిరపడవలె నన్నచో విసుగు, విరామము లేక నిస్పృహ చెందక అభ్యాసము చేయుట ఒక్కటియే మార్గము.

"సృష్టియందు ప్రకృతి ఎనిమిది విధములుగ వర్తించు చున్నది. అట్లే నీయందుకూడ. అట్లే ప్రతి గ్రహగోళము నందును, సూర్యుని యందును వర్తించుచుండును. ఇవి వరుసగా పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారములు. "నే నున్నాను" అను భావనయే ఎనిమిదవ ప్రకృతియైన అహంకారము. అది కేంద్రముగ ఏర్పడి, ఏడు ఆవరణములుగ మిగిలిన తత్త్వములు పొరలుగ ఏర్పడును. వివిధములైన పొరలకు సంబంధించిన భావముల యందు నేనను ప్రజ్ఞ వర్తించుచుండును. బుద్ధి అను ఆవరణము కూడ ప్రకృతి ఆవరణమే. అది నేనను అహంకార ప్రజ్ఞకు సామీప్యమున నుండును. కావున శాస్త్రాధ్య యనము కూడ సాధకుని ఒక ఆవరణమున బంధింపగలదు. తానుండిన కదా! తనకు శాస్త్రాధ్యయనము. తానను ప్రజ్ఞకు బుద్ధి మొదటి ఆవరణము అగుచున్నది. పంచభూతాత్మకమైన ప్రపంచము వైపు ప్రజ్ఞ తన దృష్టిని మరల్చినపుడు బుద్ధి అను ఆవరణము నుండి మనస్సు అను ఆవరణములోనికి ప్రజ్ఞ ప్రవేశించును. బుద్ధి ఆవరణము కన్న మనస్సు ఆవరణము స్థూలము. అక్కడినుండి క్రమశః పంచ భూతముల యందు సంచారము చేయు ప్రజ్ఞ పృథివి ఆవరణమున

అత్యంత స్థూలమైన విషయములలో చిక్కును. బుద్ధి నుండి పృథివి వఱకు గల ఏడు ఆవరణముల యందు సంచారము చేయు ప్రజ్ఞ - ఎనిమిదవది అగు అహంకార ప్రజ్ఞయే. మొత్తము ప్రజ్ఞ తనయందు తనవలె తానుగా ప్రకాశించుటయే అహంకారము. ఇది కూడ ప్రకృతి తత్త్వమే. అనగా మొత్తము ప్రజ్ఞకు ఎనిమిది ఆవరణము లున్నవి. వ్యక్తిగత ప్రజ్ఞకు ఏడు ఆవరణము లున్నవి. మొత్తము ప్రజ్ఞను "మహాప్రజ్ఞ" అందురు. లేక భగవంతుడు, మహా ప్రకృతి అందురు. అది తొమ్మిదవది. దానియందే మిగిలిన ఎనిమిది ప్రకృతులు ఉద్భవించి లయ మగుచున్నవి. ఈ ఎనిమిది ప్రకృతులును మొత్తము ప్రజ్ఞకు ఉత్పత్తి స్థానములు. అది ఆధారముగ వ్యక్తిగత ప్రజ్ఞ మిగిలిన ఏడు ఆవరణములు అల్లుకొనుచున్నది. వ్యక్తిగత ప్రజ్ఞను మొత్తము ప్రజ్ఞతో అనుసంధానము చేయుట మాత్రమే, ఈ ఎనిమిది ఆవరణముల నుండి బయల్పడుటకు మార్గము. మొత్తము ప్రజ్ఞతో వ్యక్తిగత ప్రజ్ఞ అనుసంధానము చెందని స్థితియందు ఎనిమిది ప్రకృతులయందు చిక్కుకొనును. మహా ప్రజ్ఞను ధరించి ఏమరుపాటు లేక జీవించుటయే జ్ఞాన మనబడును. దీనికి నిరంతర సాధన మావశ్యకము."

బోధకుడు యింకను వివరించసాగెను. "ముందు చెప్పిన విధముగ వ్యక్తిగత ప్రజ్ఞను మొత్తము ప్రజ్ఞతో జోడించి జీవించుట అత్యున్నతమైన సాధన, ఇట్లు జోడించుటయే యోగము. ఈ విధముగ జోడింపక యోగాభ్యాసము ఎంత చేసినను ఫలములేదు. మహా ప్రజ్ఞయందు స్థిరపడిన వ్యక్తిగత ప్రజ్ఞ, స్థిరప్రజ్ఞ యగును. స్థిరప్రజ్ఞను ప్రకృతి ఆవరణములు బంధింపలేవు. ఇట్లు యోగింపక

రకరకముల అభ్యాసములు చేయువాడు రకరకముల విషయముల యందు చిక్కుకొని చనిపోవును. యత్నించువారిలో లక్షకొకని చొప్పున మహాప్రజ్ఞను అంటియుండును. అతడు నిరంతర అభ్యాసవశమున సమ స్తమునందును మహాప్రజ్ఞను కూడ దర్శించుచుండును. అనగా వస్తువులను, వ్యక్తులను, లోకములను చూచునపుడు మహాప్రజ్ఞ అస్తిత్వమును అందు మరువడు. అట్లు మరువక దైవమును, లోకములను సమకాలికముగ దర్శించుటయే జ్ఞాన విజ్ఞానము లను జోడించుట. అట్టివాడు యోగిగ స్థిరపడును.

సంఖ్యాపరముగ పై విషయములను ఋషు లీ విధముగ వివరించి యున్నారు.

ప్రకృతులు = 8, జీవుడు = 9వ వాడు, దైవము=10.

జీవుడు దైవముతో యోగించిన తొమ్మిది పదితో చేరి 10 అగును. ఎట్లనగా 9+10=19, 1+9=10.

జీవుడు ప్రకృతితో యోగించిన ప్రకృతి బద్ధుడగు చున్నాడు. అది ఎట్లనిన 9+8=17, 1+7=8.

కావున పూర్ణత్వమునకై పూర్ణతత్త్వమును ఆరాధించుట ఉత్తమమని ఋషులు పేర్కొనిరి.

అమనస్కుడిట్లని ప్రశ్నించెను. "ప్రకృతి తత్త్వములు ఎనిమిదని తెలిపితిరి. మహా ప్రకృతి లేక మహా ప్రజ్ఞ లేక భగవంతుడు తొమ్మిదవది అని తెలిపితిరి. పదియవ తత్త్వము ఏదైయున్నది? ఇంతకును జీవుడు ఎనిమిదవ ప్రకృతి తత్త్వమైన

అహంకారముగ తెలిసి యున్నాడు. ఎనిమిది, తొమ్మిది, పది తత్త్వములను సవివరముగ తెలుపుడు?'' బోధకుడిట్లని తెలిపెను.

అప్రమత్తుడవై వినుము. మనలో ఎనిమిది తత్త్వములు వున్నట్లు గుర్తింపవచ్చును. **1. పృథివి** : గోళ్ళు, చర్మము, దంతములు, ఎముకలు, జుట్టు మున్నగు ఘన పదార్థములు. ఇవి అన్నియు భూమిలోని ఖనిజములచే చేయబడినవి. ఈ ఘనపదార్థమునే పృథివి లేక భూమి అందురు. **2. జలము:** మన దేహమున జలమున్నది. రక్తములో కూడ జలమయ ద్రవ్యమున్నది. భూమిపైనను జలమున్నది. **3. అగ్ని** : మన దేహము నందును పదార్థముల యందును కూడ వేడిమి యున్నది. దీనినే అగ్ని అందురు. **4. వాయువు** : మనయందు వాయువు శ్వాసగా, ప్రాణ ప్రవృత్తులుగ వున్నది. మన చుట్టూ భూమిపై గాలి యున్నది. **5. ఆకాశము** : మన దేహము నందును, దేహము చుట్టును చోటు వున్నది. ఇంటి లోపల, ఇంటి బయట చోటు వున్నట్లు. దీనిని ఆకాశమందురు. ఈ ఐదింటిని పంచ భూతములని పేర్కొందురు. ఇవి అన్నియు పరతత్త్వము నుండి పొరలు పొరలుగ స్థితి భేదము చెంది ఏర్పడినవి. భూగోళము వీనితోనే చేయబడినది. మన శరీర ములు కూడ వీనితోనే ఏర్పడినవి. ఇవి కాక మనలో మనస్సు, బుద్ధి కూడ పనిచేయుచున్నవి. అట్లే గోళము చుట్టునూ కూడ గోళముయొక్క మనస్సు, బుద్ధి పనిచేయుచుండునని గ్రహింప వలెను. పెద్దలు అట్లు గ్రహించి వాటికి **భూమి బుద్ధి, భూమి మనస్సు** అని పేరిడినారు. భూమి మనస్సును ఇక్ష్వాకు అని, భూమి బుద్ధిని వైవస్వతుడని పేర్కొనినారు. ఇవి వరుసగా 6,7 ప్రకృతులు. మన దేహమందుగల ఈ తత్త్వము లన్నియు

గుర్తించు తెలివిగ మనమున్నాము. నేను, నాకన్న మిగిలిన ప్రపంచముగా గుర్తించు తెలివిని **అహంకార** మందురు. ఇది ఎనిమిదవ ప్రకృతి తత్త్వము. ఇట్లు మొత్తము నేనను ప్రజ్ఞ ఎనిమిది విధములుగా స్థితి భేదము చెందుచున్నది. ఎనిమిది విధములుగా వర్తించుటయే వాని స్వభావము లేక ప్రకృతి. ఈ అష్ట ప్రకృతులు ప్రతి దేహమునందును, ప్రతి గోళము నందును వర్తించును. ఈ మొత్తమును వర్తింపచేయు ప్రజ్ఞను తొమ్మిదవ దానిగ, నేనను వెలుగుగా ఎరుగుము. దీనియందు యితరము లన్నియు జనించి, వృద్ధిచెంది లయమగు చుండును. దీనినే స్వ, ఇతరములు అను భేదము లేని వెలుగుగ గుర్తించుము. అహంకార ప్రజ్ఞయందు నేను, ఇతర ములు కన్పట్టుచుండును. తొమ్మిదవ ప్రజ్ఞయందు ఇతరములు లేక తానే యుండును. ఈ తొమ్మిదవ వెలుగును మహా ప్రకృతి యని, దైవమని పేర్కొంటిని. ఇందు స్వేతర భేదములు లేవు. ఈ వెలుగు కూడ అవ్యక్తము నుండి ఉద్భవించినదే. అది అనిర్వచనీయము. అది సృష్టిలో తొమ్మిదవది అయిన వెలుగుగ నుండును. సృష్టి కవతల అవ్యక్తముగ నుండును. సమస్తము నందు అంతర్యామిగ నుండును. ఇది పదియవది. దీనినే వేదము నందు బ్రహ్మము అనిరి. బ్రహ్మముతో జత పడుటయే యోగ పరమావధి.'' బోధకుడు ఇట్లు వివరించి అమనస్కునకు మౌనము ప్రసాదించెను.

## 5

బోధకుడు తెలిపిన గంభీరమైన యోగపర విషయము లను అమనస్కుడు శ్రద్ధాభక్తులతో ఆలకించెను. ఒక ప్రశాంత మైన ప్రదేశము నెన్నుకొని తనయందు తనవలెయున్న అంత ర్యామి దర్శనమునకై పునః ప్రయత్నము ఆరంభించెను. క్రమశః మనస్సును శ్వాసపై నియమించుట దీర్ఘకాల మభ్యా సము చేసెను. అది కారణముగ స్పందనాత్మక చైతన్యమును చేరెను. ఈ స్పందనాత్మక చైతన్యమే కేంద్రముగ తా నున్నానని దర్శించెను. ఈ స్పందన మాధారముగనే శ్వాసాదులు నడుపబడు చున్నవని తెలిసెను.

తాను స్పందనమని తెలిసిన క్షణమున తనచుట్టు తా నేర్పరచుకొన్న అభిప్రాయముల పొరలు తొలగి తానుండుటగ తన ప్రజ్ఞ లగ్నమయ్యెను. తాను స్పందించుటకు కారణమేమి? అను ప్రశ్న అతనికి జనించినది. తనకన్న అతీతముగ స్పందనమును నిర్వర్తించు మరియొక ప్రజ్ఞ వున్నదని తెలిసినది. దీనినే బోధకుడు అంతర్యామియని తెలిపినాడని కూడ తెలిసినది. అంతర్యామితోనే తాను చేయబడినాడని తెలిసినది. సమస్త జీవరాసులను కూడ ఇట్లంతర్యామి యందే స్పందించుచూ కోటానుకోట్ల కేంద్రము లుగ పుట్టి పెరిగి లీనమగుచున్నారని కూడ తెలిసినది. వ్యక్త మైన ఈ కేంద్రములను వ్యక్తులుగ గుర్తించుచున్నారని తెలిసి నది. తానొక వ్యక్తి అనగా నేమో తెలిసినది. అంతర్యామియే ఒక

కేంద్రముగ వ్యక్తమైనప్పుడు తానున్నానను భావన తనకు కలుగుచున్నది. అంతర్యామియందు తానున్నప్పుడు, తానున్నానను భావనకూడ కరిగిపోవుచున్నది. అనంతము, అపారము అయిన ప్రజ్ఞా సముద్రమునందు అలలవలె సమస్త జీవరాసులు వ్యక్తమగుట, అవ్యక్తములోనికి లీనమగుట లీలాప్రాయముగ తెలిసినది. అవ్యక్తమనగ, వ్యక్తిగ తాను లేక వెలుగె యుండుట ఇదియే బోధకుడు తెలిపిన నివస్థితి. సమస్తము అంతర్యామి నుండియే వ్యక్తమగుచున్నట్లు భాసించినపుడు దేవతలు, మంత్ర తంత్రాదులు, పూజలు, అర్చనములు, అభ్యాసములు వానియందు తిరుగు తరంగములవలె గోచరించినవి. ఇన్నిటి యందును అంతర్యా మిగ దైవము నిత్యము భాసించియుండగ దైవమును చూడక మంత్రములను, తంత్రములను, పూజలను, అర్చనములను, వివిధములైన దేవతా రూపములను దర్శించుట గమనించి అమనస్కుడు నవ్వుకొనెను.

అన్నిటియందును అంతర్యామిని చూచుట అంతర్ముఖ ముగను, బహిర్ముఖముగను అమనస్కుడు ఒక దీక్షగ నిర్వర్తించుట ఆరంభించెను. పుట్టుట, పెరుగుట, చనిపోవుట అన్నవి కూడా అంతర్యామియందే జరుగుచుండుట గమనికకు వచ్చి ఆనందముతో కూడిన ఆశ్చర్యచకితు డయ్యెను. అంతర్యామిని చూచువారు దేహము విడుచుటయందు కూడ చూచుచున్నారు గనుక చనిపోవుట లేదని తెలిసినది. వారు అంతర్యామిని భావించుటచే చనిపోవుటను భావించుట లేదు. చనిపోవుట కూడ

భావనయే యని తెలిసి అభ్యాసమున తరించెను. అమనస్కుడు సూక్ష్మబుద్ధితో ఇట్లని భావించెను.

"ఎవడు ఏ భావనను భావించునో వాని కది సత్యముగ దర్శన మిచ్చును. తన భావమే తనకు సత్యమని భాసించుటచే దానియందు జీవించును. భయపడువానికి భయము సత్యము. ఈర్ష్య పడువానికి ఈర్ష్య సత్యము. లేదనుకొను వానికి లేకపోవుట సత్యము. ఉన్నదనుకొను వానికి వుండుట సత్యము. సందేహ పడువానికి సందేహము సత్యము. కుల, మత, వర్గ, జాతి భావములు కలవారికి అవి సత్యము. కొందరికి బాధలు సత్యము. మరికొందరికి దిగులు సత్యము. ఇట్లు అంతర్యామి యందుండియు తనయం దేర్పడిన భావములయందు జీవించుటచే ఆ భావములే సత్యములుగ గోచరించుచున్నవి. అంతర్యామియగు దైవమునే పిండిబొమ్మలుగ నేర్పరచుకొని అవి సత్యముగ భావించుచు జీవించుట కూడ భావమే గనుక అంత ముండును. జనించిన భావమునకు అంత ముండక తప్పదు. భావమున కాధారమైన అంతర్యామియందు నిలబడియున్నచో క్షరమగు భావములయందు చిక్కుకొనక అక్షరుడై అంతర్యామి యందున్నట్లు తెలియుచున్నది."

ఇట్టి స్థితిలో అమనస్కునకు తన దేహమందలి అంతర్యామితో దృఢమైన సంబంధ మేర్పడ సాగినది. దేహముతో సంబంధము తగ్గినది. దేహము లేకున్నను తానుండుట ఏమో తెలియసాగినది.

అమనస్కుని తపస్సు ముందుకు సాగినది. తానొక

స్పందనాత్మకమగు బిందువుగ హృదయమున గోచరించి క్రమశః ఊర్ధ్వముఖుడై భ్రూమధ్యమున చేరినాడు. అచట తన భ్రూమధ్యము రెండు కొండల నడుమనున్న లోయవలెను, కొండల అంచున ఏర్పడివున్న అనంతమైన నీలాకాశమును అత్యంత రమణీయముగ గోచరించినది. అత్యంత ఆహ్లాదము కలిగించు నాద మొకటి ఉద్భవించి తనకు శమము పూర్ణముగ కలిగించినది. పరమానందము కలిగినది. వేణునాదమై ప్రణవ నాదము ఉద్భవింపగ బ్రహ్మదండమందలి సమస్త నాడులును మూలాధారము వఱకు స్పృశింపబడి దేహము పులకాంకిత మయ్యెను. ఊర్ధ్వా అథస్సులు ఏకమై నాదమున పరమానంద భరితుడై నిలచెను. బ్రహ్మదండమున తానొక వెలుగుస్తంభముగ గోచరించెను. దాని నాశ్రయించి షట్చక్రములు, షట్కమలముల వలె గోచరించినవి. అందుండి వృక్ష మూలములనుండి ఏర్పడిన శాఖలవలె సమస్త నాడులు, నాడీ కేంద్రములు తేజో మయమై గోచరించినవి. ఇంద్రియము లన్నియు అంతర్ముఖమై గోపికలవలె నాదగానము నందు మైమరచినవి.

క్రమశః తనయందలి ఈ నాదము భ్రూమధ్య స్థాన మనెడు ఆకాశమున నిలచి నాద రూపమై తన్నావరించెను. అంతర్ముఖముగ ఈ నాదము పలు రకములుగ అమనస్కుడు అనుభూతి చెందెను. గజ్జెల మ్రోతలు వినబడినవి. ఘంటానాదము వినబడినది. శంఖనాదము వినబడినది. వీణా నాదము ఆనందము కలిగించినది. తాళ నాదము మరొక ఆనందము కలిగించినది.

వేణునాదము పరమానందము కలిగించినది. భేరి, మృదంగ మేఘనాదములు తనను అత్యాశ్చర్యకరముగ వ్యాప్తి గావించినది. తాను స్పందనాత్మక బిందువుగను, విశ్వాత్మక స్పందనముగను కూడ అమనస్కుడు అనుభూతి చెందినాడు.

పై విధముగ ప్రణవ నాదామృతమును అమనస్కుడు పానము చేయుచుండగ అతని బ్రహ్మాదండము నందలి షట్కమలములు, నాడీ కేంద్రములు, నాడులు తేజోవంతములై ప్రకాశించినవి. వెలుగు శరీర నిర్మాణమును కావించినవి, అమనస్కుడు పరిశుద్ధుడై, జరామరణముల కతీతు డయ్యెను. లోకోత్తరుడయినాడు. అనగా లోకములుగ, ఆవరణలుగ ఏర్పడిన ప్రకృతిని దాటినాడు. 9వ దానిగ, మహాప్రకృతిగ, దైవముగ, వెలుగుగ, నాదముగ, ఆకాశముగ నిలిచినాడు.

అమనస్కుడు హంస మంత్రము నాధారముగ తపస్సు కొనసాగించుచునే యుండెను. తాను స్పందనాత్మకునిగ సమస్తమును అనుభూతి చెందుచు నుండెను. స్పందనము ద్వయాక్షరి తనయందు జరుగుచుండగ లోదృష్టి యేర్పడి చిత్కళలను కాంచెను. దహరాకాశమునందు మిరుమిట్లు గొలుపు నక్షత్రములను గాంచెను. నల్లని ఆకాశమును గాంచెను. క్రమశః అది ఎరుపెక్కి ప్రళయకాల మందలి అగ్నివలె అతి భయంకరముగ నుండు ఎఱ్ఱని ఆకాశమును గాంచెను. మరల అదియే చోటులో కరిగించిన బంగారపు రంగుగ ఆకాశము కనబడెను. అకస్మాత్తుగ మరల ఆ ఆకాశము కోటి సూర్యప్రభలతో రాజిల్లుచుండినట్లు కాంచెను. అదియే ఆకాశము

మరల పాల సముద్రమువలె స్వచ్ఛమైన తెల్లని తరంగములతో గోచరించెను. అత్యంత ఆకర్షణీయమైన చంద్రప్రభలతో కూడిన ఆకాశమునందు కర్పూర తరంగములు గోచరించెను. ఇంద్ర నీలము, వైఢూర్యము, పగడము, పద్మరాగము, ముత్యము, గోమేధికము మొదలగు శ్రేష్ఠమగు కాంతులు ఆ ఆకాశమున గోచరించి అదృశ్య మగుచుండెను.

ఇట్లు బహువిధములగు కళలు దీర్ఘకాలము అనుభూతి చెందెను. ఈ కళలకు ఆధారముగ స్పందనము, నాదము జరుగుచునే యున్నవి. క్రమశః కళలు శమించి నిర్మలమైన నీలాకాశము స్థిరపడినది. అందు మధ్యభాగమున సూర్య బింబము గోచరించెను. ఆ సూర్యుడు తానే అని కూడ అమనస్కుడు దర్శించెను. తాను సాక్షిగ సమస్త కార్యములు తననుండి ప్రవర్తింపబడుట కూడ అమనస్కుడు దర్శించెను. ఆ జ్ఞాన సూర్యుడు భ్రూమధ్య మనెడు పర్వతలోయలో నుండి ఉదయించు చుండుట కూడ గమనించెను. తనలోని కొంతభాగము ఆ సూర్యునికి, అతని ప్రకాశములకు నమస్క రించెను. అటులనే కన్నులనుండి ఆనంద బాష్పములు వర్షించెను. వర్షించిన ఆనంద బాష్పములను కనుపించుచున్న సూర్యునకు అర్ఘ్యప్రదానము చేసెను.

పిదప అదే ఆకాశమున చంద్రబింబము గోచరించెను. అమనస్కుడు శాంతించెను. సూర్యచంద్రాత్మకమైన బ్రహ్మముగ, తన్ను తాను అనుభూతి చెందెను. పరమానందభరితు డయ్యెను.

# 6

ఆమనస్కుడు కనులు తెరిచెను. తన ఎదుట చిరు దరహాసముతో బోధకుడు నిలబడి యుండెను. ఆశీః పూర్వకమైన దృష్టి బోధకుని కన్నులనుండి అమనస్కుని పైకి ప్రసరించెను. అమనస్కుడు బోధకునకు పాదాభివందనము చేసెను. బోధ కుడు చిరునవ్వుతో నీ వెవరవు? అని ప్రశ్నించెను. అమనస్కుడు "నేను నేనైన నేనును" అని సమాధానము నిచ్చెను. బోధకుడు సంతోషించి "నీవు ఇపుడు సర్వ స్వతంత్రుడవు, నీవెట్లు నిర్ణయించుకొందువో ఇటుపై నీ జీవితమట్లు సాగగలదు. అనంతమైన ఆనందము నీ సొత్తైనది." అని పలికెను. అమనస్కు డిట్లనెను. ప్రతి జీవునకును ఇదియే సహజమైన స్థితియని తెలియవచ్చుచున్నది. దీని కొఱకై రకరకములుగ జీవుడన్వేషించు చున్నాడని కూడ తెలియవచ్చుచున్నది.

"ఈ శాశ్వతము, అపరిమితమైన ఆనందము కొఱకు అశాశ్వతము, దుఃఖకారకమైన తావులయందు జీవుడు వెతకుకొనుట అత్యాశ్చర్యకరముగ నున్నది. శాశ్వతానందమునకు నిర్దిష్టమగు మార్గమున్నను ఇందు జీవుడు జొరపడక తమతమ ధ్యేయము కొఱకై అన్య మార్గముల నన్వేషించుచున్నాడు. ఇంతకన్న ఇంద్రజాల మేమియు లేదు. అన్వేషించుచున్న జీవులకు ఈ మార్గమును స్పష్టము చేసినచో జీవులకు ప్రయాస తగ్గును కదా!" బోధకుడు ఒక్కసారి ఫక్కున నవ్వి ఇట్లనెను. జీవులు ఆనందము కొఱకు

అన్వేషించుట సత్యము. అన్వేషణలో సృష్టియందలి ద్వంద్వపూరితమైన అనుభవము లను అనేకములను పొంది వాటి వాటి తాత్కాలికతను క్రమశః గ్రహించి నిర్దిష్టమగు యోగ మార్గమున ప్రవేశింతురు. మార్గము ఎప్పుడును స్పష్టముగనే యున్నది. కాని దానియందు ప్రవేశించుటకు వలసిన సంస్కారములు జీవునిలో క్రమశః ఏర్పడును. వలసిన సంస్కారములు ఏర్పడిననే గాని మార్గము రుచింపదు. అన్వేషణము ఒక తపస్సుగ ఏర్పడి ఆ తపస్సనే అగ్నిలో సమస్తములైన కుసంస్కారములు తగులబడుచున్న సమయమున మాత్రమే అంతర్ముఖమగు మార్గమున ఆసక్తి కలుగును. అంతకు మునుపు కార్యకారణ సంబంధముగ బహిరంగమున పలు విధములగు కార్యములను నిర్వర్తించుచు కష్టసుఖములు, మంచిచెడ్డలు, కీర్తి అపనిందలు అను డోలాయమాన జగత్తున ఊగిస లాడుచుండును. ధర్మము నెంత ఆదరించునో అధర్మమునంత ద్వేషించుటచే ద్వంద్వ మును దాటలేక ఘర్షణ యందు జీవించుచుండును. ధర్మము నాచరించు వారు అధర్మమును ద్వేషించుట తగదు. అధర్మ ప్రవృత్తి యందున్న వారి అజ్ఞానపు స్థితిని గమనించి దయ చూపుటయే యుండవలయును. అధర్మమును శిక్షించినప్పటికి కూడ దానియందు ద్వేషము లేక శిక్షించుట శ్రీరాముడు, శ్రీకృష్ణుడు చూపిన మహత్తరమైన మార్గము. సృష్టి సమస్తము దైవమునుండి ఏర్పడినదే కావున సృష్టిలోని ద్వంద్వములను కూడ దైవముగ చూచుట అను ఈ మార్గమున ప్రవేశించుటకు

అన్వేషించు జీవునకు కొంత కాలము పట్టక తప్పదు. కావున మార్గము స్పష్టముగ నున్నప్పటికి, అందుబాటులో నున్నప్పటికిని అంతుపట్టక యుండుట జరుగుచున్నది."

"ఇప్పుడు నా కర్తవ్యమేమి?" అని అమనస్కుడు ప్రశ్నించగ, "నీ కర్తవ్యమును నీవే నిర్ణయించుకొన వలయును. నీ భావి జీవితమునకు నీవే బ్రహ్మవు. తగు రీతిని యోచన చేసి నిర్ణయించుకొనుము" అని బోధకుడు తెలిపెను. అమనస్కుడు తనయందలి అంతర్యామి నుండియే కర్తవ్యమును తెలుసుకొనగోరి మరల కనులు మూసుకొనెను.

అమనస్కుడు తన కర్తవ్యము తెలియగోరి మరల ధ్యానమున నిలచెను. తానెవరో, తన నిజస్వరూప మెట్టిదో తనకు తెలిసినది. అంతర్యామి ప్రజ్ఞయే తనయందు తనవలె నున్నది గాని తానొకడు ప్రత్యేకముగ లేడని తెలిసియున్నది. అంతర్యామియే కోటానుకోట్ల జీవులుగ వ్యక్తమగుచున్నాడని తెలిసినది. ఇట్లు వ్యక్తమయిన జీవులు తమదైన అస్థిత్వము లేర్పరచుకొనుట వలన అజ్ఞానపు పొర కమ్మి వ్యక్తులగు చున్నారని, ఎవరికి వారుగ తమకొఱకై జీవించుచున్నారని కూడ తెలిసినది. తమ కొఱకై తాము జీవించుట అను అభ్యాసమున తమచుట్టూ వ్యక్తిగత వలయములను నిర్మించు కొనుచు తమ్ము తాము బంధించుకొను చున్నారని కూడ తెలిసినది. అట్టి బంధనమున పరస్పర భేదభావనలు, ఘర్షణలు, తత్ఫలితముగ కొట్లాటలు, యుద్ధములు కూడ జరుగుచున్నవని తెలిసినది. అజ్ఞానపు పొరలు దట్టమై

బలిష్ఠమై జీవుల నడుమ అగాధము లేర్పరచగ, జీవుడు దీనుడై, బందీకృతుడై దుఃఖించుట గోచరించినది.

ఇట్లు దుఃఖించుచున్న జీవులను ఓదార్చు జీవులు కూడ కనపడిరి. వారియందు ప్రజ్ఞా వికాసము కొంత మెరుగుగ గోచరించినది. దారి కోరిన జీవులకు దారి చూపువారు, జ్ఞానము కోరిన జీవులకు జ్ఞానము నిచ్చువారు, దీనులకు సేవలందించువారు నిర్మలముగ విద్యా వైద్యమును గరపువారు, సంఘశ్రేయస్సుకై పాటుపడువారు. నిర్మలము ప్రశాంతము అయిన జీవన విధానము నందించువారు - ఇట్లనేక జీవులు లోకహితులుగ పనిచేయుట కూడ గోచరించినది. ఇట్టి లోకహితుల యందు ఒక పరంపర కూడ గోచరించినది. అమనస్కునకు ఉత్సాహము కలిగినది. కోట్లాది జీవుల నడుమ వెలుగు రవ్వలవలె తిరుగాడుచున్న లోకహితులను గమనించి స్ఫూర్తి చెందినాడు. వెలుగురవ్వల యందుకూడ కొన్ని చిన్నవి గను కొన్ని పెద్దవిగను గోచరించినవి. ఆసక్తికరముగ పెద్దగ రవ్వల రూపమున వెలుగుచున్న జీవులను ప్రత్యేకముగ పరికించి పరిశీలించి చూచినాడు. అత్యాశ్చర్యకరమైన దృశ్యము గోచరించినది. అమనస్కుడు పులకించినాడు. ఆనందము ఉప్పొంగినది. ఆ పరికించిన వెలుగురవ్వ ఎవ్వరో కాదు తన బోధకుడే!

అమనస్కుడు బోధకుని ధ్యానమున గమనించిన క్షణముననే బోధకుడు కూడ అమనస్కుని గమనించి చిలిపిగ

చిరునవ్వు నవ్వెను. ఆ నవ్వునుండి ఆహ్లాదకరమైన కాంతులు ప్రసరించి అమనస్కుని స్పృశించెను. ధ్యానమునందున అమనస్కునకు కనులనుండి జాలుగ నీరు కారెను. తన బోధకుడు తనబోటి వారికి శిక్షణ నిచ్చుచు నిర్విరామముగ భౌతిక లోకమున వెలుగు నింపుటకై కృషిచేయుట చూసి అతని హృదయము ద్రవించెను. తన బోధకుడు సర్వ స్వతంత్రుడు. అంత మాత్రము చేత ఊర్ధ్వ లోకమున నుండక దైవ ప్రేరితమైన సృష్టియందు తన వంతు కర్తవ్యమును నిర్మలముగ నిరాండబరముగ నిగూఢముగ నిశ్శబ్దముగ నిర్వర్తించుచున్నాడు! ఇంతకు మించిన కర్తవ్య మేమున్నది. అతడు తనను తనంత వానిగ తీర్చిదిద్దినాడు. తనను స్వతంత్రుని జేసినాడు. అటుపై కర్తవ్యమును తననే నిర్ణయము చేసుకొనమనినాడు. ఎంతటి మహోన్నత సంస్కారము! సాధారణముగ గురువులు శిష్యులను నిర్దేశింతురు. ఈతడు ఎన్నడును తనను ఏమియూ నిర్దేశింపలేదు. నా కనువగు మార్గము తెలిపి నన్ను నాకు వదిలినాడే గాని, తన తంత్రమున బిగింపలేదు. ఏమి కారుణ్యము! ఎంతటి మైత్రీ భావము!! కావున తానును అట్లే నిర్వర్తింప వలెనని నిశ్చయించుకొనెను. అమనస్కుని ధ్యానము అతనిని కర్తవ్యోన్ముఖునిగ నిలిపినది. ధ్యానము ఆగినది. అమనస్కుడు కనులు తెరచెను.

# 7

కనులు తెరచి అమనస్కుడు తనచుట్టును పరికించి నాడు. మరల ఆశ్చర్యము కలిగినది. తన చుట్టును తన తల్లితండ్రులు, సోదరులు, బంధువులు, మిత్రులు చేరి యున్నారు. తల్లితండ్రుల కనులలో బాష్పములు గోచరించినవి. అమనస్కుడు మరింత పరికించి చూడగ అతడు తన తల్లితండ్రుల నివాసము నందునే మేల్కాంచినట్లు గుర్తించెను. కొంత తడవు అయోమయ మున పడెను. తానిచట ఎట్లుండెను? అంతకుముందు బోధకుని ఆశ్రమమున వుండెడివాడిని కదా! ఏమియు అంతు పట్టలేదు. తల్లివైపు చూసి "నే నిక్కడి కెట్లు వచ్చితిని"? అని ప్రశ్నించెను. తల్లి ఇట్లనెను: "నీవు కనులు మూసి పన్నెండు మాసములైనది. ఈ రోజు మాఘ పౌర్ణిమ. క్రిందటి మాఘ పౌర్ణమినాడు నీవు సముద్ర తీరాన సుదీర్ఘముగ నడచి సొలసి పడిపోయితివి. నిన్ను వెదకుకొని మనవారు ఇంటికి గొనివచ్చినారు. ఈ సంవత్సర మంతయు నిన్ను గూర్చిన వేదన నాకును, నీ తండ్రికిని అపరిమితమైనది. నీవు స్పృహకోల్పోయి సంవత్సరమైనది."

అమనస్కుడు సంవత్సర కాలము తర్వాత స్పృహలోనికి వచ్చుట ఇంటి వారికిని, బంధువులకు వూరిలోని వారికిని సంతుష్టి కలిగించినది. ఈ సంవత్సర కాలము అమనస్కునికి మాత్రము బహిర్గతముగ స్పృహ కోల్పోవుటగా జరిగినను అంతర్గతముగ వివిధములైన అనుభూతులకు తావిచ్చెను. అతనికి క్రమశః జరిగిన సంఘటన లన్నియు జ్ఞప్తి వచ్చెను. తాను సిద్ధుల

సహకారమున సూక్ష్మ లోకమును ప్రవేశించుట, దివ్యశరీర నిర్మాణము జరుగుట, ధ్యాన మార్గమున జ్ఞాన విజ్ఞానములను బడయుట, తాను అక్షరుడనని తెలియుట, నాదబిందు కళాత్మకమైన అనుభూతులను కూడ నొందుట గోచరించినవి. ఇవి అన్నియు నొక ఎత్తు, తన బోధకుడు ఒక ఎత్తు. బోధకుని స్మరణ కలుగగనే మరల అమనస్కుని హృదయము పొంగినది, కనులనుండి బాష్పములు జాలువారినవి. అతడెంతటి దయార్ద్ర హృదయుడు, అతని హృదయ మెంత నిర్మలము. అతని నవ్వు వెన్నెలను విరజిమ్ముచు తనను ఆహ్లాద పరచుచు ప్రోత్సహించు చుండెడిది కదా! అతనందించిన సూత్రములు, నిర్దేశములు, చిరునవ్వు తన నత్యంతముగ ప్రోత్సహించు చుండెడివి. తా నతనితో శాశ్వతానందమును అనుభవించు చుండెడివాడు. అతనితో తనకు జరిగిన తుది సంభాషణము మరల గుర్తు వచ్చినది. ‘‘ఇప్పుడు నా కర్తవ్యమేమి? అని అమనస్కుడు ప్రశ్నించగ, ‘‘నీ కర్తవ్యమును నీవే నిర్ణయించుకొన వలయును. నీ భావి జీవితమునకు నీవే బ్రహ్మవు, తగు రీతిని యోచనచేసి నిర్ణయించుకొనుము’’ అని బోధకుడు తెలుపుట. యిత్యాది సమస్త విషయములు వరుసగ గుర్తు వచ్చినవి. తానొక సంవత్సరము స్పృహకోల్పోయినాడు. ఆశ్చర్యము! తనకా సంగతియే తెలియదు. అన్వేషకుడై సాగరతీరాన పడిపోవటం వరకూ తనకున్నది బాహ్యస్పృహ అటుపై జరిగిన దివ్య సాధనమంతయూ అంతః స్పృహ. తాను పొందిన శిక్షణ యంతయూ అంతర్ముఖమే! తనను సూక్ష్మ లోకాలకు దివ్య పురుషులిరువురు గొనిపోవుట, తనకిపుడు అర్థమయినది. వారు

గొనిపోయినది తన సూక్ష్మ శరీరమునే. సమస్త శిక్షణము సూక్ష్మ శరీరమున జరిగినది. తన స్థూల శరీరము మాత్రమిచటనే యున్నది. అది స్పృహకోల్పోయి సంవత్సరకాలము తన తల్లి దండ్రులచే పరిరక్షింపబడినది. అంతయూ అమనస్కుని విభ్రాంతి గావించినది.

లోకహితుల యజ్ఞజీవనము తనకు స్ఫూర్తి కలిగించుట వలన తానుకూడ తనవారి పరిణతికై కృషి చేయవలెనను తన సంకల్పము మరల గుర్తువచ్చినది. అది కారణముగ తాను శరీరమున మేల్కాంచుట జరిగినదని తెలియ వచ్చినది. అమనస్కుని మనస్సు కుదుట పడినది. బోధకునకు హృదయము నందు నమస్కరించుకొనెను. ఆశీర్వచన ముద్రతో, మందహాసముతో బోధకుడు హృదయమున గోచరించు చున్నాడు. తనవంతు లోకహిత కార్యమునకు వలసిన ప్రణాళికకు రూపకల్పన చేయుట ప్రారంభించెను.

తనవారికి, తన ఊరికి వలసిన విషయము లేమి? అని ప్రశ్నించుకొనగ విద్య, వైద్యము, యోగము అని సమాధానము వచ్చినది. ఈ మూడింటిని తనవంతు కర్తవ్యముగ సంఘమున ప్రవేశపెట్టుటకు కృషి సలిపెదనని నిర్ణయించు కొనెను. ప్రప్రథమముగ తల్లితండ్రులను సంతోషపెట్టి వారి అనుజ్ఞ మేరకు కార్యములను నిర్వర్తింప వలెనని కూడ నిర్ణయించుకొనెను. తండ్రి ప్రజాపతియైన బ్రహ్మదేవునకు ప్రతీక. తల్లి ప్రకృతికి ప్రతీక. వారిరువురి మనస్సును సంతోష పెట్టుటచే తగు ఆశీర్వచన

బలముండునని భావించెను. అమనస్కుడు క్రమశః ఆహారము స్వీకరించుట ద్వారా శరీర పుష్టిని పొందెను. అతనొకనాడు ఉదయమున తూర్పుదిశగ కూర్చుండి దీర్ఘాలోచన యందుండగ అతని తల్లితండ్రులు సమీపించి ఇట్లనిరి.

"నీవు బ్రతికి బట్ట కట్టితివి, మాకదియే ఆనందము. చిన్నతనము నుండి నీవు మెత్తని వాడవు, నిర్మల స్వభావుడవు. నిన్ను సంఘము తన స్వార్థముచే మ్రింగునేమో అన్న భయమున నీ భావము కడ్డు పడితిమి. నీ వెట్లు నీ జీవితమును మలచుకొనినను మాకు సమ్మతమే. నీవు మాయందుండుటయే మా కోరిక. నీ భావములకు అడ్డువచ్చిన కారణమున నీవు ఇల్లు వదలితివి. సముద్ర తీరమున నీకు మరణించినంత పని అయినది. మా వఱకు నీవు మరల బ్రతికి వచ్చినట్లే. యథేచ్ఛగ జీవింపుము, మా సంపూర్ణ సహకారము నీకు గలదు."

అమనస్కున కాశ్చర్యము కలిగినది. ఆనందము కూడ కలిగినది. తాను ప్రప్రథమముగ తల్లితండ్రులను సంతృప్తి పరచవలె ననుకొనెను. దానికి బదులుగ తల్లితండ్రులు తృప్తిపడి తన సంతృప్తి కొఱకు సహకార మందింతు మనిరి. తన కోరికయే వరముగ తన వద్దకు తిరిగివచ్చుట శుభారంభమని భావించి తల్లితండ్రులకు నమస్కరించెను.

స్వస్థత చేకూరిన అమనస్కుడు తూర్పు సముద్ర తీరములో వ్యాహ్యాళికై బయలు దేరాడు. తన సమస్త సాధన ఆ సముద్ర తీరమువద్ద ఏకాంతముగా సాగింది. తన కక్కడే దివ్యపురుషుల

సందర్శనము జరిగింది. ఆ తరువాత వారితో తను సూక్ష్మ లోకాల్లోకి పయనించి సంవత్సరముపాటు సమస్త శిక్షణము పొందాడు. తనకు ఆ అనుభవమంతా భౌతికమే అనిపించింది. కాని తాను ఆ సముద్ర తీరములో మూర్ఛిల్లినట్లు గాని, తల్లితండ్రులు వెదకికొని తనని ఇంటికి తీసుకు వచ్చినట్లుగాని, సంవత్సరముపాటు స్థూల శరీర స్పృహ తనకు లేనట్లుగాని తనకు అనిపించనే లేదు. తానున్నట్లే తనకి స్పష్టమైన భావన. ఆ దివ్య లోకాలలోని సోదరబృందము అంతా కూడ తనకు భౌతికంగానే గోచరించారు. ఆ లోకములో బోధకుడు తనకిచ్చిన శిక్షణనంతా కూడ తనకు భౌతికమే. ఆ అనుభవమంతా భౌతికమైతే మరి ఈ భౌతిక స్థితి ఏమిటి? తనలో నుండి తనకు సమాధానమిలా వినిపించింది. "అంతా భౌతికమే. కాకపోతే భౌతికము స్థూలముగాను, సూక్ష్మము గాను ఏడు పొరలలో వ్యాపించి వుంటుంది. ఒకదానికన్న ఒకటి స్థూలముగ ఏర్పడి ఏడవస్థితిలో పృథివీస్థితి కలుగుతుంది. సూక్ష్మము నుంచి స్థూలములోకి, స్థూలమునుండి సూక్ష్మములోకి మెట్లదారి ఒకటి కలదు. ఈ దారియే నీవు నడచిన దారి. ఇది సనాతనము. దీనినే యోగ మార్గమని యోగులు తెలుపుదురు. "నా" మార్గమని భగవంతుడు తెలుపుచున్నాడు. దివ్య లోకములలో నున్నప్పుడు నీకవి వాస్తవము. భౌతిక లోకములో నున్నప్పుడు అనగా స్థూల లోకములలో వున్నప్పుడు నీకిది వాస్తవము. ఎప్పటికప్పుడు ఎక్కడి కక్కడ వాస్తవముగ నుండును. నిజమునకు యిన్నిటియందు నీవుండుట వాస్తవము. సమస్తము నందు నేనుగ వ్యాపనము చెందుట వాస్తవము."

అమనస్కుడు సమాధాన పడెను. సముద్ర తీరమున ఆకాశమును, సముద్రమును, రెంటిని ఆవరించియున్న వెలుగును దర్శిస్తూ అలాగే కాసేపు నిశ్చలుడై వుండిపోయాడు. బోధకునకు తానిచ్చిన వాగ్దానము జ్ఞప్తికి వచ్చుచున్నది. తాను భువికి దిగివచ్చి తన వారికి దివిని పరిచయము చేయాలని, వారు కూడా ఈ ఆనందము పొందాలని, దానికి తగిన కృషి సలుపుతానని బావించాడు. అది కారణముగనే మరల భౌతిక దేహములో మేల్కాంచాడు. తన కార్యక్రమము ఎక్కడ మొదలుపెట్టాలి, ఎలా మొదలుపెట్టాలి, ఎవరితో మొదలు పెట్టాలో తన కర్థం కాలేదు.

